# సత్తు రూపాయ

= రచన: శ్రీ కలగర్ల నీలకంఠేశ్వరరావు =



ఒరే శర్మా! ఇలా రోజూ ఆలస్యంగా కాలేజీకి వెళ్తే మొదటి క్లాసులకు ఏలా హాజరు అవుతావురా? ఎండెక్కితేగానీ పక్కమీద నుంచి లేవవు. ఏడు గంటలైంది. లే' అని అమ్మ పక్కమీద పడుకొని వున్న మేలుకొలుపు పాడగానే ఏవేవో తీయని స్వప్నాలు కంటున్న నేను ఈ లోకంలోకి వచ్చి పడ్డాను.

పక్కమీద నుండి లేవటంతోనే ఎదురుగా నున్న అలారం టైంపీసు చూడటం నాకు అలవాటు. ఏ రోజైతే అది ఏడు గంటలకు తక్కువ చూపిస్తే దాని మీద ఎంతో సంతోషం వచ్చి దానికి కీ ఇస్తాను. ఎప్పుడయినా ఏడు గంటలకు ఎక్కువ చూపిందో దాన్ని అవతలకు విసిరివేయా లన్నంత కోపం వచ్చి దానికి మరి కీ ఇవ్వను.

ఇవాళకూడా అంతే జరిగింది. ఆ గడియారం, సారీ, మా యింట్లో అదొక్కటే తక్కువ. ఆ టైంపీసునే గడియారం అని పిలుస్తాను. ఇవాళ అది ఏడు గంటల పదిహేను నిముషాలు చూపించగానే మామూలుగానే కోపం వచ్చి మరి కీ ఇవ్వలేదు. త్వరగా కాలకృత్యాలు తీర్చుకొని కాలేజీకి బయలుదేరేసరికి ఏడు గంటల నలభై అయిదు నిముషాలయింది. 'భగవంతుడా ఇవాళగూడ మొదటి పీరియడు నామం కొట్టడమైంది.' అనుకుంటూ సైకిలు తీసి చూద్దునుగదా దాన్లో అదే దాని చక్రాలలో గాలి లేదు. ఎలాగో మొదటి పీరియడు పోయిందిగదా నడచి వెళ్ళినా రెండవ పీరియడుకు హాజరు కాగలను. అంచేత కాలేజీకి నడిచే వెళ్లడానికి నిశ్చయించుకొని ఇంటినుండి బయల్దేరేను.

మా యింటినుండి కాలేజీకి కనీసం రెండు మైళ్ళ దూరం. ఎంత నడచినా దూరం తరగదు. అందులో రోజూ సైకిలుమీద పెళ్ళేవాడిని ఇవాళ నడచి వెళ్ళడమంటే కాస్త కష్టంగానే వుంది. నేను కాలేజీ చేరడానికి ఇంకా పది నిముషాలే వున్నాయి కాబట్టి నడక వేగం కాస్త హెచ్చించేను.

ఇలా త్వరగా వెళ్తున్న నాకు రోడ్డుమీది ఇసుకలో తళతళమని మెరుస్తూ గుండ్రని వస్తువు కళ్ళబడగానే కాళ్ళకు బ్రేకు వేసి దాన్ని చేత్తో తీసి చూసేను. అది రూపాయి నాణెం. అంటే నాకు రూపాయ దొరికిందన్నమాట. అబ్బా! పావులా, అర్ధ కాదు రూపాయ. పుట్టి పెరిగిన దగ్గరనుండి నాకు రోడ్డుమీద డబ్బులు దొరకలేదు. ఈ రోజు ఒకేసారి రూపాయ దొరికింది. ఎవరేనా చూస్తారేమోనని దాన్ని పాంటు జేబులో వేసుకొని మళ్ళీ కాలేజీవైపు నడక సాగించేను. కాలేజీ చేరేసరికి కురో అయిదు నిముషాలు ఎక్కువగానే పట్టింది. క్లాసుకు వెళ్ళి చూద్దునుగదా, అప్పుడే లెక్చరరు రావటం, ఆయన పాఠం మొదలుపెట్టడం జరిగిపోయింది. ద్వారం వద్ద నిల్చొని 'మే ఐ కమిన్ సార్?' అన్నాను.

అంతే. ఆయన ఒక్కసారి నా వైపుచూసి 'కమిన్' అన్నారు.

క్లాసులోకి వెళ్ళి చూద్దునుగదా, మొదటి బెంచీలన్నీ నిండిపోయి వున్నాయి. కర్మకొద్ది ఆఖరు బెంచిలోనే కూర్చొని లెక్చరరు ఏమిటి చెప్తున్నారో వినడానికి ప్రయత్నించేను. ఊహూ అవేవీ బుర్రకెక్కటం లేదు. మనస్సంతా జేబులో వున్న రూపాయమీదే వుంది. నా జీవితంలో అలాంటి రూపాయల్ని ఎన్నో ఖర్చుపెట్టేను ఎన్నింటినో పోగొట్టుకొన్నానుగూడ. అయినా ఏవిటో పెద్ద నిధి దొరికినంత ఆనందంగా వుంది.

ఎలా అయితేనేం అతి కష్టంమీద ఆపీరియడు గడచిపోయింది. ఇక మూడో పిరియడుకూడ వుంది. ఆ పీరియడూ పది పదిహేను నిముషాలు గడచిపోయేయి. కానీ లెక్చరరు రాలేదు. ఇంతలో నాలాగే క్లాసంటే ఇష్టంలేని అబ్బాయి ఒకడు 'ఇవాళ క్లాసు కేన్సిల్' అంటూ అరచుకొని వచ్చి 'సోదరులారా! నేడు లెక్చరరు రానందున క్లాసు కేన్సిల్ చేయడమైనదని తెలుపుట కెంతయో ఆనందించుచున్నాను.' అని పెద్ద మంత్రిలా చిన్న ఉపన్యాసం ఇచ్చేడు. అంతే బిల బిల మంటూ ఎవరి పుస్తకాలు వాళ్లు తీసుకొని బయట పడ్డాం.

బయటకు రావటంతోనే నేను గబగబా కాలేజీ కేంటిన్ వైపు దారితీసేను. ఉదయంనుండి ఏమీ తినలేదు. ఆ ఆకలితో కేంటిన్ లోనికి వెళ్ళి పన్నెండణాలు అంటే డబ్బై అయిదు పైసలు బిల్లు అయేవరకు టిపిన్ తిన్నాను. జేబులో దొరికిన రూపాయ వుంది. మరో పావులా కూడా పూర్తి చేద్దాం అనుకున్నాను. కానీ నా మనస్సు ఎందుకో అంగీకరించలేదు. అంచేత అంతటితో నా తిండిని ఆపి బిల్లును తీసికొని వెళ్ళి కౌంటరు దగ్గర జేబులోనున్న రూపాయను తీసి ఆ బిల్లును కలపి ఇచ్చేను.

అతడు నేనిచ్చిన రూపాయని క్రిందా మీద త్రిప్పి చూసి 'మిష్టర్! ఇది సత్తు రూపాయ, మరొకటివుంటే ఇవ్వండి. ఇది మారదు.' అన్నాడు.

అంతే నా గుండె ఒక్కసారిగా ఆగినంత పనైంది. నా జేబులో మరి ఒక్క నయాపైసా అయినా లేదు. నేను గూడ ఆ రూపాయను చూసేను. నిజమే అది సత్తు రూపాయే. సందేహం లేదు. 'భగవంతుడా ఇప్పుడెలా? ఎలాగైనా నన్ను ఆపదనుండి కాపాడు అనుకున్నాను.' అంతే. దూరంగా గోపీగాడు వస్తూ కనబడ్డాడు. వాడు రాగానే, కౌంటరుకు కొంచెం దూరంగా వాణ్ణి తీసికొని వెళ్ళి 'ఒరే గోపి ఎలాగైనా నువ్వు ఇవాళ నాకు సహాయం చేసి నా పరువు కాపాడాలిరా.' అన్నాను.

వాడు నా వైపు చుర చురా చూసి 'ఊ నిన్న నీ ఇంగ్లీషు నోట్సు ఒక్కసారి రాసుకోడాని కివ్వరా బాబూ అంటే ఇచ్చావూ? ఇవాళ సహాయం చేసి నీ పరువు కాపాడాలిరా? పో నేనేవీ చెయ్యను.' అన్నాడు.

'ఒరే గోపీ క్షమించురా. ఇదిగో నోట్సు నీక్కావల్సినన్ని రోజులుంచుకో ప్లీజ్ ఒక్క డబ్బై అయిదు పైసలుంటే......'

'అసలు సంగతేవిటోయ్?' అన్నాడు వాడు హీరోలా పోజుపెట్టి.

ఇక తప్పదనుకొని సంగతంతా వాడికి వివరించాకా 'ఒరే త్వరగా ఇవ్వు లేకపోతే ఆ కేంటిన్ కేష్‌కౌంటరు నా పరువు తీసేట్టున్నాడు. చూడు ఇప్పటికే తక్కిన స్టూడెంట్సంతా ఎలా నా వైపు చూస్తున్నారో, త్వరగా ఇవ్వరా, నా బంగారు కొండవి కదూ.' అన్నాను.

అప్పటికి వాడు తన జేబులో వున్న పర్సు తీసి రూపాయనోటు తీసిచ్చేడు.

'ఇంకా ఎంతసేపయ్యా? పన్నెండణాలు ఇస్తావా లేకపోతే నీ పెన్ను తీసి ఇక్కడ పెట్టి మరీ వెళ్ళు.' అన్నాడు కౌంటరు.

'ఇదుగో మాటలు జాగ్రత్తగా రానీ తీసుకో నీ 75 పైసలూను. మిగతా 25 పైసలూ ఇచ్చేయి నోటికొచ్చినట్టు వాగక జాగ్రత్త.' అన్నాను రోషంతో. ఇంక నాకేం భయం? వాడి కివ్వవలసిన సొమ్ముకన్నా ఎక్కువే నా దగ్గరుంది.

నేనిచ్చిన రూపాయ తీసికొని తన కేష్ బాక్సులో వేసికొన్నాడు కౌంటరు. తిరిగి తన జేబులోంచి పావులా తీసి నా చేతిలో వేసేడు. దాన్ని చూద్దును గదా రెండుప్రక్కలూ గంట్లు వున్నాయి.

'ఇదిగో బుద్ది చెప్పి గడ్డి తిన్నావు ఈ గంట్లపావులా ఎక్కడ మారుతుందయ్యా ఇంకోటి ఇవ్వు' అని ఆ పావులాను వాడి మీదకు విసిరివేసేను.

Telegram : "LITHOGRAPH" Telephone : 58 & 75

**THE NATIONAL LITHO PRESS**

(Estd. (1933)

RAILWAY FEEDER ROAD, Post Box No. 30. SIVAKASI, (S. I.)

A REPUTED HOUSE
FOR
QUALITY PICTURE
CALENDARS

*PLEASE FORWARD ENQUIRIES.*

ఎదురు దెబ్బ కొట్టానన్న కోపంతో వాడు నావైపు కోపంతో చూసి తిరిగి పెట్టిలోంచి రెండు పది నయా పైసల నాణాలూ, ఒక ఐదు నయాపైసల నాణెం తీసి ఇచ్చేడు. వాటిని గోపిగాడికిచ్చి 'చాలా థేంక్సురా సమయానికి సహాయం చేసేవు.' అని తిరిగి క్లాసులోకి వచ్చి కూర్చొన్నాను. తరువాత మామూలుగానే క్లాసులన్నీ జరిగిపోయేయి.

రెండు గంటలకల్లా క్లాసులన్నీ అయిపోగానే మామూలుగా ఇంటికి వచ్చేసాను. తరువాత పనేముంది. భోజనం చేసి, రేడియో పెట్టుకొని, మంచం మీద నడుం చేరవేసేను. ఇంతలో వీధిలో ఏదో కలకలం బయల్దేరింది. ఏమిటో చూద్దామని వీధిలోకి వెళ్ళేను. విశేషమేమీ లేదు. 'వీరాభిమన్యు' సినీమా ఆ రోజే మన ఆంధ్రదేశమంతటా విడుదల అయింది. మా ఊర్లోకూడ విడుదల చేసేరు. దాని తాలూకా పబ్లిసిటి బ్రహ్మాండంగా చేస్తున్నారు.

'సోదర, సోదరీమణులారా! నేడే చూడండి బ్రహ్మాండమైన విడుదల రాజలక్ష్మి ప్రొడక్షన్సు వారి గొప్ప పౌరాణిక చిత్రం 'వీరాభిమన్యు'. మీ రింతవరకు కనీ విని ఎరుగని మహత్తర పౌరాణిక తెలుగు చిత్రం. 35 లక్షల రూపాయల ఖర్చుతో తీసిన బ్రహ్మాండమైన తెలుగు చిత్రం. తప్పక చూడండి.' ఇలా వుంది ఆ పబ్లిసిటీ చేస్తున్న వాడి గొంతు.

'వీడి దుంపతెగ 'తప్పక చూడండి' అంటున్నాడు. సినీమా చూడాలని నిర్బంధమా? చూడగా వీడి పద్ధతి గూ యింటిలో ఏ వస్తువునైనా తాకట్టుపెట్టయినా సరే రమ్మన్నట్టుగా వుంది' అన్నాడొక సినీమాలంటే పడని ఆసామి.

నాకు వాడిమీద కోపం వచ్చింది. 'ఆ సినీమా వాళ్ళేం వీణ్ని రమ్మన్నారా ఏం? సినీమా చూడటం యిష్టం లేకపోతే మానేయకూడదూ. వాళ్ళ ననటం దేనికి?' అనుకున్నాను.

ఆ రోజు 'వీరాభిమన్యు' మేటనీకి వెళ్ళాలని నిశ్చయించుకున్నాను. సరిగ్గా మధ్యాహ్నం రెండుగంటలకు సినిమాకు వెళ్ళడానికి తయారై నా బీరువాలో నున్న నా కేష్‌బాక్స్‌లో నుండి రెండు రూపాయల నోటు ఒకటి తీసి జేబులో వేసుకొన్నాను. మా ఇంట్లో వాళ్ళు నాకు నెలకు ఖర్చుకని కొంత సొమ్ము ఇస్తారులెండి. దానిలో కొంత నా కేష్‌బాక్స్‌లోవేసి మిగతాది వాడుతుంటాను. ఈ పని చాలాకాలం నుండి చేస్తువుండటం వల్ల కొంచెం పెద్ద మొత్తమే ఆ బాక్స్‌లో కూడుకునింది.

సమంగా రెండు గంటల పదిహేను నిముషాలకి ఇంటినుండి బయలుదేరి హాలువద్దకు వచ్చేను. ప్రొద్దున్న దొరికిన సత్తు రూపాయ ఇంకా నా జేబులో వుంది. ఇక హాలు వద్ద పరిస్థితి ఎలా వుందంటే, టిక్కెట్లిచ్చే చోట జనం తన్నుకుంటున్నారు. ఒకరిమీద మరొకరు ఎక్కి టిక్కెట్లు తీస్తున్నారు. ఇలా వున్నారు జనం. ఆ సినిమాకి చూడగా చిత్రంకోసం మదుపుపెట్టిన 35 లక్షల రూపాయలూ ఇక్కడే వచ్చేటట్టుంది. నేను రూపాయ ముప్పై పైసల టిక్కెట్లిచ్చే బుకింగు వద్దకెళ్లి అడిగేను. వాళ్ళు ఎడ్వాన్సుగానే ఇచ్చేసారట. మరెలా ఇంకేదయినా టిక్కట్లున్నాయేమోనని చూసేను. 75 పైసల టిక్కట్లిచ్చే బుకింగ్ ఒక్కటే తీసి వుంది. అక్కడైనా జనం. ఇక నేనక్కడికి వెళ్ళాలంటే అభిమన్యుడు పద్మవ్యూహం లోనికి వెళ్లినట్టే వెళ్లాలి. అభిమన్యుడికైతే పద్మవ్యూహంలోకి వెళ్లటం తెలుసు. కానీ తిరిగి రావటం తెలీదు. నాకు మాత్రం ఈ పద్మవ్యూహంలోకి వెళ్లటమే తెలియదు. ఇలా ఆలోచిస్తున్న నాకు 'మీకు టిక్కట్టు కావాలా అండీ?' అన్న మాటలు విని తిరిగి చూసేను. వెంటనే ఆ మాటలన్న వాడు బ్లాకులో టిక్కట్లమ్మిన వాడని గ్రహించేను. ఎక్కడో ఒకదగ్గిర టిక్కెట్టు దొరకటమే కావాలని వాణ్ని 'టిక్కట్టెంత?' అని అడిగేను.

'ఒకే ఒక రూపాయండీ' అన్నాడు.

వెంటనే నేను నా జేబులో నున్న సత్తు రూపాయను తీసి వాడికిచ్చేను. దాన్ని వాడు జేబులో వేసుకున్నాడు. తరువాత వాడు నాకొక 75 పైసల టిక్కట్టిచ్చేడు, దాన్ని తీసుకుని సంతోషంతో తిరిగి వస్తున్నాను. నాకు డబ్బులివ్వకుండానే టిక్కట్టు దొరికింది ఆ సత్తు రూపాయను వదలించుకొన్నాను గూడ. ఇంతలో 'ఒరే శర్మా! టిక్కట్టెలా కొన్నావురా?', అంటూ గోపిగాడు ఎక్కడినుంచో వచ్చేడు. 'బ్లాకులో కొన్నాను. 75 పైసల టిక్కెట్టు 1 రూపాయకు' అన్నాను.

'నాకూ కూడా ఒకటి తెచ్చిపెట్టరా, నేనలా వెళ్ళి కిళ్ళీలు కటించుకొస్తాను' అంటూ వాడు 2 రూపాయల నోటు వెళ్ళిపోయేడు.

నేనిం ఎవరిదగ్గరైతే టిక్కట్టు కొన్నానో వాడి వద్దకే వెళ్ళి గో అబ్బి మరొక టిక్కట్టిచ్చి తక్కిన రూపాయ ఇ అన్నాను. వాడు నేనిచ్చిన రెండు రూపాయల నోటు తీసికొని టిక్కట్టూ, రూపాయ తిరిగి ఇచ్చేడు. నేను సగం దూరం వచ్చి చూద్దును గదా, వాడు ఇందాక నేనిచ్చిన సత్తు రూపాయే తిరిగి ఇచ్చేడు. ఇప్పుడెలా ఈ సత్తు రూపాయ గోపిగాడు ప్రొద్దున్నే చూసేడు. దీన్నిగానీ వాడికిచ్చేనా వాడు నేను తన రూపాయని దాచి ఈ సత్తు రూపాయని ఇచ్చేనని అనుమానపడతాడు. పోనీ టిక్కట్టిచ్చినవాడి వద్దకు వెళ్ళి తిరిగి మంచి రూపాయ ఇమ్మందామంటే 'ఇది మీరే ఇచ్చారు కాబట్టి దీన్ని తిరిగి మీకేఇచ్చేను' అంటాడేమోనని భయంకొద్దీ నా జేబులోనున్న రెండు రూపాయల నోటు మార్చి ఒక రూపాయ, టిక్కట్టూ గోపిగాడు రాగానే ఇచ్చి సినిమాలోకి వెళ్ళి కూర్చున్నాను.

సినిమా చూస్తున్నానన్న మాటేగానీ నా మనస్సంతా ఈ సత్తు రూపాయని ఎలా వదల్చుకోవాలా అని చూస్తుంది. సినిమా వదిలేరు. జనం త్రొక్కిడిలో నా బుష్‌షర్టు కొద్దిగా చిరిగిపోయింది. 'భగవంతుడా నేరకిపోయి ఈ సినిమా కొచ్చేను.' అనుకొన్నాను. ఇంటికి తిరిగి వచ్చేసరికి ఆరున్నర గంటలైంది. నా గదిలోకి వెళ్ళి డ్రస్సు మార్చి కూర్చొని 'ఆంధ్రప్రభ' తిరగవేస్తుండగా చెల్లాయి వచ్చి 'అన్నయ్యా! మన విశాఖపట్నం మామయ్య వచ్చేరు.' అంది.

'ఏవిటీ మామయ్య వచ్చేరా?' అన్నాను నేను పరధ్యానంగా.

'అవునన్నయ్యా మామయ్యా, వాళ్ళ అమ్మాయట

నీకంటూ కొంచెం చిన్నది. ఆమె కూడ వచ్చింది. అన్నయ్యా ఆమె చాలా బావుంటుంది. మరే అమ్మ చెప్పిందీ, ఆవిణ్ణి నేను 'వదినా' అని పిలాలిట.' అంది చెల్లాయి. ఆమె చెప్తున్న మాటలు విని ఆశ్చర్య పోయేను. అంటే కమల వచ్చిందన్నమాట. కమలను చూసి కనీసం ఎనిమిదేళ్ళయి వుంటుంది. ఇప్పు డెలా వుందో కమల. అప్పటి పదేళ్ళ కమల పరికిణీ జాకట్టూ వేసికొని 'బావా' 'బావా' అంటూ ఇంటికి వచ్చినప్పు డల్లా నా పుస్తకాలలోని కాగితాల నన్నిటిని చింపి పాడుచేస్తుండేది. ఇప్పుడు కమల ఎలా వుందో.

'చెల్లీ ఇప్పుడా అమ్మాయి ఎక్కడ వుంది?' అన్నాడు.

'వంటింట్లో వుందన్నయ్యా, అమ్మతో మాట్లాడు తుంది' అంది.

'చూడమ్మా నువ్వెళ్ళి అమ్మతో నేను కాఫీ కావా లన్నానని చెప్పు' అన్నాను.

'అలాగే' అంటూ చెల్లి వెళ్ళిపోయింది.

'ఏరా శర్మా బావున్నావా?' అంటూ మామయ్య గదిలో ప్రవేశించేరు.

'అరే! మామయ్యా! ఎప్పుడొచ్చేరు? రండి' అంటూ కుర్చీ తెచ్చి వేసేను.

కుర్చీలో కూర్చొంటూ 'శర్మా! ఫైనల్ ఇయర్ కి వచ్చేవుటగా. ఈ సంవత్సరం పూర్తి కాగానే బి. ఎ. పూర్తవుతుందిమాట. సరే తరువాత సంగతేవిటి బి.ఎల్. చదువుతావా, ఎమ్. ఎ. చదువుతావా?' అన్నారు.

'ఏదో చూద్దాంలే మామయ్యా ముందిది పూర్తికానీ' అన్నాను.

ఇంతలో ద్వారంవద్ద 'నానా్న' అన్న పిలుపు విన బడడంతో ఒకేసారి ఇద్దరం అటువేపు చూసేం ద్వారం వద్ద కమల గ్లాసుతో కాఫీ పట్టుకొని నిలుచుంది. ఆమెను చూసి ఆశ్చర్యపోయేను. ఎనిమిదేళ్ళలో కమ లలో ఎంత మార్పు? తెల్లని పరికిణీ నీలం రంగు



హైదరాబాద్ మరియు తెలంగాణా ప్రదేశానికి ఏజంట్లు: ప్రభాకర్ ఏజన్సీస్, విజయవాడ.
ఇతర ఆంధ్రప్రదేశానికి ఏజంట్లు: విజయా ఏజెన్సీస్, విజయవాడ.

జాకెట్టూ, వీనిపై ఆకుపచ్చని వోణీ వేసుకుంది. ఆమె తెల్లని శరీరానికి దుస్తులు మరింత కాంతి నిచ్చినట్టున్నాయి. విశాలమైన ఆమె నుదుటి మీదనున్న చిన్న తిలకపు బొట్టు చంద్రునిలోనున్న మచ్చను గుర్తుకు తెస్తుంది.

'ఏమిటమ్మా? నే నిప్పుడే కాఫీ త్రాగి వచ్చేను' అన్నారు మామయ్య.

'అది కాదు నాన్నా ఇది......' సందేహించింది కమల చెప్పటానికి.

'ఓ ఈ కాఫీ బావకన్నమాట. అయితే అక్కడే నిలబడ్డావేం? లోపలికి వచ్చి ఇవ్వు' అన్నారు.

కమల వచ్చి కాఫీ ఇచ్చింది. గ్లాసును అందుకున్నాగానీ నేను కాఫీ త్రాగలేదు. కమలవేపే అలా చూస్తు వున్నాను కమల తల ఎత్తి నావేపొక్కక్షణం చూసింది. అంతే ఆ తరువాత వెంటనే తల దించేసుకుంది.

'అరే అలా చూస్తావేమిట్రా? కమల జ్ఞాపకం లేదూ? అప్పుడే దీన్ని చూసి చాలా కాలమైందిగా. ఎప్పుడో చిన్నప్పుడు చూసి వుంటావు. అరే ఏడుగంటలైంది వార్తలు వినాలి. శర్మా! రేడియో ఎక్కడుందిరా?' అన్నారు మామయ్య.

'ప్రక్క గదిలోనే వుంది' అన్నాను.

'సరే నే నిప్పుడే వార్తలు విని వస్తాను. అందాక మీరిద్దరూ మాట్లాడుతూ వుండండి' అని మామయ్య వెళ్ళిపోయేరు.

తల వంచుకొని నేలపై కాలి బొటనవ్రేలు వ్రాస్తూ నిలుచుంది కమల. 'బావున్నావా కమలా?' అని అడిగేను.

సమాధానంగా 'ఊ' అన్న శబ్దం మాత్రం ఆమె నోటినుండి వచ్చింది.

'నిల్చునే వున్నావేం? కూర్చో' అన్నాను.

ఆమె కూర్చుంది. 'కమలా నేను జ్ఞాపకం వున్నానా?'

'లేకేం? నువ్వే నన్ను మర్చిపోయేవు బావా.'

'చదువుకుంటున్నావా?' అడిగేను.

'ఊ.'

'ఏమిటి?'

'ఎస్.ఎస్.ఎల్.సి. పాసయ్యేను. ఈ యేడే పి.యు.సి 'అబ్బో పి. యు. సి. కొచ్చావన్న మాట. సైన్సు గ్రూపేనా?' అవునన్నట్టుగా తలూపింది కమల.

'ఇంకేం డాక్టరు వవుతా వన్నమాట.'

కమల చిరునవ్వు నవ్వుతూ 'అదేమిటి బావా అలా అంటావు. నే నెలా డాక్టరవుతాను. ఈసంవత్సరంతో మానేస్తానుగా.'

'అదేవిటి?' అన్నాను ఆశ్చర్యంతో.

'ఔను బావా! నాన్న ఎస్. ఎస్. ఎల్. సి. తోనే మానేయమన్నారు కానీ నా పట్టుదలవల్ల ఎలా అయితేనేం ఈ ఒక్క సంవత్సరం చదవటాని కొప్పుకున్నారు' అంది కమల.

'అదేవిటీ, మామయ్య రానీ, నేను చెప్తాను' అన్నా న్నేను.

'ఒద్దు బావా, అసలే ఆయన కోపిష్ఠి.' అంది కమల భయంతో.

ఇంతలో అమ్మ పిలవటంతో కమల గ్లాసు పట్టుకొని 'వస్తాను బావా' అంటూ వెళ్ళిపోయింది.

తెల్లవారి మామూలుగా కాలేజీకి బయలుదేరుతూ బుష్షర్టు తొడుక్కుందామని తీద్దునుగదా నిన్న సినీమా జనంలో అది చిరిగిపోయింది. దాన్ని తొడుక్కొని కాలేజీకి ఎలా వెళ్లను. 'అమ్మా! సాష్టు చిరిగిపోయింది కాస్త కుట్టిపెట్టవే' అన్నాను.

'నీ కిలాంటి సమయాలలోనే కావాలి సాయంత్రం కుడతాలే. ఇంకేదయినా షర్టు తొడుక్కొని వెళ్ళు' అంది మా అమ్మ.

'నేను కుడతాను ఇలా తే బావా' అంటూ కమల వచ్చింది.

'నువ్వా, నా షర్టు కుడతావా?' అన్నాను.

'ఏం తప్పా?' అంది.

'సరే పది నిముషాలలో కావాలి, ఈలోగా నేను కాఫీ త్రాగి వస్తాను' అన్నాను.

'ఇదుగో, పది నిముషాలెందుకు అయిదు నిముషాలలో పని పూర్తి చేస్తాను' అంది.

కాఫీ త్రాగి వచ్చేలోగానే కమల నా షర్టు కుట్టటం పూర్తి చేసింది. బట్టలు తొడుక్కొని కాలేజీకి బయలుదేరుతుంటే మళ్ళా కమల వచ్చింది.

'కాలేజీకేనా బావా?' అంది.

'అవును' అన్నాను.

'అదేవిటీ, వట్టి పేంటు షర్టుతో నేనా కాలేజీకి వెళ్లటం? మా కాలేజీలో కొందరు స్టూడెంట్సు టెర్లిన్ షర్టు, గేబర్డీన్ పేంటు వేసుకొని, టక్ చేసుకొని వస్తారు. అసలు నువ్వు ఒక కాలేజీ స్టూడెంటువని ఎవ్వరూ అనుకోరు' అంది.

'ఇదిగో కమలా! అలాంటివేమీ నాకు పడవు. ఎలా వెళ్ళినా సరే కాలేజీలోకి రానిస్తారు. ఈ వేషంలో వెళితే రానివ్వరని భయం లేదు. వస్తా' అంటూ బయల్దేరాను.

దారిలో కొందరు రక్షణ నిధి వసూలు చేస్తూ కనబడ్డారు. పాకిస్తానీలు మన భారత భూభాగాన్ని ఆక్రమించుకోడానికి ప్రయత్నిస్తున్నారు. అందుచేత దేశమంతట రక్షణనిధి వసూలు చేస్తున్నారు. ఇంతలో సీలు వేసిన పెట్టె ఒకటి పట్టుకొని రక్షణ నిధి కోసం నా దగ్గరకు ఒకాయన వచ్చేడు. నేను జేబులో చెయ్యి పెట్టగానే సత్తు రూపాయ దానికి తగిలింది. దాన్ని ఆ పెట్టెలో వేసి వదుల్చుకోవా లనుకున్నాను. కానీ నా మనస్సంగీకరించ లేదు. 'ఇది దేశ రక్షణ నిధి. దేశానికే ద్రోహం చేస్తావా' అంది నా అంతరాత్మ.

వెంటనే నేను కాలేజీ ఫీజుకని పట్టుకెళుతున్న సొమ్ములోనుండి ౨ రూపాయలు తీసి ఆ పెట్టెలో వేసేను. ఫీజు కట్టడానికి ఇంకా టైముంది. రేపేనా కట్టవచ్చు అనుకున్నాను.

పదకొండు గంటలకు కాలేజీనుండి తిరిగి వచ్చి ఇంట్లో చూసేసరికి మా చెల్లెలి స్కూలు పిల్లలందరూ బాణాలు పట్టుకొని దసరా పద్యాలు పాడుతూ కనిపించేరు. అప్పటికిగాని తెలిసిరాలేదు అవి దసరా రోజులని. ఇంటిలోకి వెళ్ళి చూసేను. స్కూలుమాస్టారు కుర్చీమీద కూర్చొని వున్నారు. లోపలికి వెళ్ళేసరికి మా అమ్మ నన్ను పిలచి 'శర్మా, దీన్ని మాస్టారిగారికి చెల్లి చేత ఇప్పించరా' అంటూ తోమలపాకులలో


అందమునకు
సుఖమునకు
సరియైనకొలత
మంచినేతకు ....

వీనస్

బనియన్లు ధరించండి!!

ఫోన్ నెం.

2 3 5




టెలిగ్రాం :

'' వీనస్ ''

: ఆంధ్ర ఏజెంటు :

యస్. వి. సుబ్బారావు.

శ్రీనివాస టెక్స్టైయిల్సు : : పెడన (క్రిష్ణా జిల్లా)

చెక్కలగుండ వేసి దాన్లో నాలుగు ఇచ్చు రూపాయలు పెట్టి ఇచ్చింది. దాన్లోనుండి ఒక రూపాయ తీసికొని నా దగ్గరున్న సత్తు రూపాయని వాటిలో వేసి మా చెల్లెలి చేత మాష్టారుకు ఇప్పించేను' పిల్ల లందరికి బిస్కట్లు పంచిన తరువాత అందరూ వెళ్ళిపోయేరు.

ఆఖరున మాష్టారు వెళుతూ 'అన్నట్టు శర్మా! ఆ రోజు బజార్లో నాకు రూపాయ చాలకపోతే ఇచ్చావు గదు. దాన్ని తిరిగి ఇవ్వటమే మర్చిపోయేను' అంటూ తనకు ఇచ్చిన దసరా కట్నంలోనుండి నేను వేసిన సత్తు రూపాయే తీసి ఇచ్చి వెళ్ళిపోయేరు. 'నీకూ నాకూ యెడబాటు లేదు తల్లీ' అనుకుంటూ దాన్ని తిరిగి జేబులో వేసుకున్నాను.

రాత్రి నా గదిలో కూర్చొని చదువుకొంటుండగా చేతిలో ఒక పుస్తకం పట్టుకొని కమల వచ్చింది.

'బావా! రేపే మేం వెళ్ళిపోతున్నాం' అంది ఆమె చేతిలోనున్న పుస్తకం తీసికొని పేజీలు తిరగవేస్తూ 'అప్పుడేనా కమలా!' వచ్చి రెండురోజులైనా కాలేదే' అన్నాను.

ఇంతలో పుస్తంలోనుండి కమల ఫోటో జారిపడింది. దాన్ని నా చేతులోకి తీసికొని 'ఇదెప్పుడు తీయించుకున్నది కమలా?' అని అడిగేను.

'రెండు నెలలయి వుంటుంది బావా! మా కాలేజీ గర్ల్స్ అంతా పిక్నిక్కి వెళ్ళినపుడు ఈ ఫోటో తీయించుకొన్నాను.'

'ఇదొక్కటేనా ఇంకో కాపీ వుందా?'

'ఇంకో కాపీ వుంది కానీ ఇక్కడ లేదు ఇంట్లో' అంది.

'అయితే ఈ ఫోటో నాకివ్వు' అన్నాను.

కమల చిరునవ్వుతో 'నా ఫోటో నీ కెందుకు బావా' అంది.

'నీ ఫోటో నాకాక్కపోతే ఇంకెవరికి కావాలి మరదలా!' అన్నాను.

'చాల్లే బావా హాస్యం! సెలవుల్లో తిరుపతి వెళతావని అత్తయ్య చెప్పింది. తిరిగి వచ్చేటపుడు ఒకసారి విశాఖపట్నం రాకూడదూ' అంది కమల.

'ఓ! తప్పకుండా వస్తాను' అన్నాను.

'ఇక వస్తాను బావా' అంటూ కమల వెళ్ళిపోయింది.

కమల వెళ్ళిపోయిన గంట తరువాతదాకా చదువుకుంటూ కూర్చున్నాను. ప్రక్క గదిలోనుండి ఏవో మాటలు వినబడసాగేయి. వాటిని విందామని ప్రయత్నించేను.

'ఏవిటోనమ్మా దాన్ని ఒక ఇంటిదాన్నిగా చేసేదాకా నాకు బెంగగానుంది' అది మామయ్య గొంతు.

'అదేవిటన్నయ్యా! మన మందరం అప్పుడే నిశ్చయించుకున్నాం కమలను శర్మకిచ్చి వివాహం చేయాలని. మరి నాలుగునెలల్లో వాడి పరీక్షలయిపోతాయి. ఆ తరువాత ముహూర్తం ఎప్పుడు పెట్టాలో ఆలోచించవచ్చు' అంది మా అమ్మ.

'అంటే కమల నా భార్య కాబోతుం దన్నమాట. ఎంత అదృష్టం' అనుకున్నాను నేను.

ఆ మర్నాడు కమలా, మామయ్యా వెళ్ళిపోయేరు. యూనివర్సిటీ పరీక్షలు కూడ అయిపోయేయి. అనుకున్న ప్రకారంగానే తిరుపతి వెళ్ళి స్వామి దర్శనం చేసుకున్నాను. తిరిగి వస్తూ విశాఖపట్టణంలో దిగడానికి నిశ్చయించుకొన్నాను. హైదరాబాదులో రెండు రోజులుండి తరువాత విశాఖపట్టణానికి టిక్కట్టు తీసుకొని బండి ఎక్కేను.

రైల్లో చాలా రష్‌గా వుంది. ఎలాగో నాకు చోటు దొరికింది. విశాఖపట్నం ఇంకా నాలుగు స్టేషన్లు వుండనగా అదేవిటో నిద్ర వచ్చేటట్టు కనిపించింది. నా పర్సు తెరచి దాన్లో వున్న సొమ్మునంతా జేబులో వేసుకున్నాను. ఆనాడు కమల ఇచ్చిన పొటో ఆ పర్సులోనే వుంది. దాన్ని నా పాంటు జేబులో వుంచుకున్నాను.

ఇంతలో నే నున్న కంపార్టుమెంటులోనికి ఒక కుఱ్ఱవాడు వచ్చేడు. చింపిరి తల, మాసి, చిరిగిపోయిన కమీజు చూడగా ఎవరో ముష్టి ఎత్తుకునే కుర్రవాడిలాగే వున్నాడు. పాపం వాడికెక్కడా చోటే దొరకలేదు. క్రింద ఎవరి కాళ్లవద్ద కూర్చున్నా వాడిని కసిరి పొమ్మంటున్నారు. నాకు జాలివేసి వాణ్ని నా కాళ్లవద్ద చోటుంటే కూర్చోమన్నాను.

పర్సు తీసి తిరిగి కమల పొటో తీసి చూసేను. 'నీ దగ్గరకే వస్తున్నాను' అన్నాను మనస్సులో: ఆపర్సులో మరింకేం లేదు ఆనాడు దొరకిన సత్తు రూపాయ తప్ప. తర్వాత చిన్న కునుకు పట్టింది.

ఇంతలో బండి ఏదో స్టేషనులో ఆగింది. నా ప్రక్కన కూర్చున్న ఆయనతో 'ఇదే స్టేషనండీ' అని అడిగేను.

'విశాఖపట్నం' జవాబు చెప్పేడు.

నేను త్వరగా లేచి నా బేగు తీసికొని జేబు చూసుకున్నాను. నాపర్సు కనిపించలేదు. అరే ఎలాపోయింది. దాన్లో నా కమల ఫొటో కూడ వుంది. హఠాత్తుగా నాకు నా కాళ్ల వద్ద నున్న కుర్రవాడు జ్ఞాపకం వచ్చాడు. నా ప్రక్కనాయనతో వాడి సంగతి అడిగేను.

'అరే ఇప్పుడే వాడుగూడ బండి దిగి వెళ్ళేడండీ'

నేను వెంటనే బండి దిగి వాడికోసం స్టేషనంతా గాలించినా కనబడలేదు. ఇంతలో ఒకచోట నలుగురయిదుగురు కూడి వుండటం చూసి అక్కడికి వెళ్ళి చూసేను. అది ఒక హోటలు. ఇందాక పిల్లవాడే అక్కడ వున్నాడు.

'దొంగ రాస్కెల్, టిఫిన్ తిని సత్తు రూపాయ ఇచ్చి ఎగవేద్దామనుకున్నావా? వెధవ రూపాయ' అంటూ ఆ హోటలువాడు రూపాయని విసరివేసి వాణ్ని తన్నటం ప్రారంభించేడు. నేను వాణ్ని ఆపి 'ఎంతండి, వాడు మీకు ఇవ్వాలి?' అన్నాను.

'పన్నెండణాలు' అన్నాడు.

పన్నెండణాలనగానే ఆనాడు కాలేజీ కేంటిన్‌లో జరిగిన సంఘటన జ్ఞాపకం వచ్చింది. వెంటనే వాడి కా డబ్బు ఇచ్చివేసేను. ఆ కుర్రవాణ్ని దూరంగా తీసికెళ్ళి 'ఒరేయ్ నా దగ్గిర పర్సు తీసేవుగదూ?' అన్నాను.

వాడు ఏడుస్తూ 'అవునండీ, ఇంకెప్పుడూ అలాంటి పనులు చేయనండీ' అన్నాడు.

'ఆ పర్సు నేం చేసావురా?' అన్నాను.

'దాన్ని అల్లక్కడ పారేశానండి' అన్నాడు.

వాడి చేతిలో ఒక రూపాయ పెట్టి 'ఒరే నాయనా! మంచివాడివి, ఎక్కడ పడేశావు చెప్పు?' అన్నాను.

'అదుగో ఆ పోస్టు డబ్బా వెనకాల' అన్నాడు.

'మరి దాన్లో రూపాయ?' అడిగేను.

'దాన్ని హోటలువాడు విసిరేశాడండి, మీరేచూసారుగా' అన్నాడు.

నేను వెంటనే ఆ పోస్టుడబ్బా వెనకాలకు వెళ్ళి చూసేను. వాడు చెప్పినట్టే ఆ పర్సు అక్కడే సురక్షితంగా వున్నందుకు భగవంతుణ్ని మనసులో ధ్యానించేను. ఇంకా అనుమానం వచ్చి పర్సులో కమల ఫొటో వుందో లేదో అని చూసేను. అదిగూడ వుంది. అమ్మయ్య ఎలా అయితేనేం సత్తు రూపాయ పీడ వదలింది. తర్వాత రిక్షామీద మామయ్య గారింటికి వచ్చేను.

ఆ రాత్రి నేను కమలతో సత్తు రూపాయ విషయం చెప్పి, దానివల్ల నేను పడిన బాధలు కూడా చెప్పేను.

అంతా విని కమల 'పోనీలే బావా, ఆ కుర్రవాడి ధర్మమా అంటూ, నిన్ను బాధలు పెట్టిన ఆ సత్తు రూపాయను వదిలించుకున్నావులే,' అంది.

ప్రకాశమునకూ.. మన్నికకూ
"బెంగాల్ లాంప్" నే ఉపయోగించండి.




ఆంధ్రప్రదేశానికి సోల్ ఏజెంట్లు:
జి. ఎ. పరశురాం అండు కో..
"బెంగాల్ హౌస్"
హైదరాబాదు -4 (ఎ. పి.)